క్లుప్తంగా

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ధరూరు: మండలంలోని అల్వలపాడులో శనివారం ఏరువాక సందర్భంగా తోరణం తెంచే కార్యక్రమంలో ఎద్దులతో వచ్చిన దళితులను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా నేటికీ పల్లెల్లో అంటరానితనం, కుల వివక్షత కొనసాగుతుందన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కుల దూషణ చేసినా, రేవులపల్లి పోలీసులు కేసు నమోదు చేయడం లేదని విమర్శించారు.

భూత్పూరు కాల్వలో పూడికతీత



అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువుకు సాగునీటిని అందిస్తున్న భూత్పూరు రిజర్వాయర్ కాల్వలో పేరుకుపోయిన పూడికతీతతో పాటు ముళ్లపొదలను మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి సొంత డబ్బులతో పనులను చేపడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో జూరాల నుంచి భూత్పూరు రిజర్వాయర్‌కు నీరు వదలడంతో ఎప్పుడు కాల్వకు సాగునీరు వదిలినా.. పూడిక తీయించడంలేదు. దీంతో నీరు ముందుకు సాగడం లేదు. రైతుల విన్నపం మేరకు పట్టణానికి చెందిన దేశాయి ప్రకాష్ రెడ్డి చెరువుకు సాగునీరు అందాలన్న లక్ష్యంతో సొంతంగా జేసీబీతో కాల్వలో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. దీంతో చెరువు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 'గాడ్స్ ఆఫ్ వారియర్స్ షోటోఖాన్' కరాటే అకాడమి ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పరీక్షల్లో 16 మంది విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో బెల్ట్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు హరీష్‌యాదవ్, జాఫర్ సాధిక్, బాబా అజ్మీర్, కార్తికేయ యాదవ్, సురేందర్, అరవింద్, హర్షవర్ధన్, పవన్‌తేజ్, గౌస్‌పాషా తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలి



మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలని టీఎస్‌పీఎస్‌సీ సభ్యుడు మోహన్‌రావు అన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలలో ఉత్తమ మార్కులు సాధించిన ఎరుకల విద్యార్థులకు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అంకిత (పదవ తరగతిలో 9.3 జీపీఏ), ఆనంద్‌కుమార్ (7.5 జీపీఏ), ఇంటర్మీడియట్‌లో అక్షయ (ఎంపీసీ– 834 మార్కులు), హారిక (ఎంపీసీ– 764), కె.నందిని (723), ఈ.స్వాతి (బైపీసీ–800) మార్కులు సాధించారని అన్నారు. వారితో పాటు డిగ్రీలో 825 మార్కులు సాధించిన శ్రీనివాసులుకు మెమోంటో, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. చదువుకోవడానికి ఏదైన ఆర్థికంగా ఇబ్బంది ఉంటే తనను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎరుకల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పర్వతాలు, రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం, ప్రధాన కార్యదర్శి శంకర్, జ్ఞానేశ్వర్, ఆంజనేయులు, నర్సిములు, ఎం.బాలయ్య, హన్మంతు, రాములు, వెంకటస్వామి, మల్లయ్య, వసంత, శేఖర్ పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ చెందిన విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం నాగయ్య, పీఈటీ నిరంజన్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.హన్సిక, డి.నవీన్‌కుమార్‌లు ఎంపికైనట్లు వివరించారు.

పూర్తయ్యేది ఎన్నడో?

- ఆలస్యమవుతున్న అయిజ బ్రిడ్జి పనులు
- గడువు ముగిసినా పూర్తికాని వైనం
- ఇబ్బందులు పడుతున్న మూడు రాష్ట్రాల ప్రజలు



బ్రిడ్జి పక్కన వాగులో మట్టిని తొలగిస్తున్న పొక్లెయిన్



పూర్తికాని బ్రిడ్జిపై నడుస్తున్న ప్రజలు

అయిజ: పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రోడ్డు రవాణా సౌకర్యం బాగుండాలి. గ్రామాలు, పట్టణాల మధ్య రోడ్లను నిర్మించడంతో పాటు వాగులపై వంతెనలు నిర్మించాల్సి ఉంటుంది. అయితే రోడ్డు ఉన్నా సరే వంతెన నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణానికి ప్రతికూలం ఏర్పడి తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు 11 నెలలుగా అనేక అవస్థలు పడుతున్నారు.

మొక్కుబడిగా డైవర్షన్ రోడ్డు

డైవర్షన్ రోడ్డు సరిగా లేకపోవడంతో పట్టణంలోని గల్లిలో చిన్న రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తుండడంతో తరుచూ ట్రాఫిక్ జాం ఏర్పడి గంటలపాటు కదలలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బ్రిడ్జి నిర్మించే ముందు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. వాహనాలు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలి. ఆర్అండ్‌బీ అధికారులు అవేవి పట్టించుకోకుండా ఊరి చివరన మొక్కుబడిగా మట్టిరోడ్డును వేశారు. ప్రభుత్వ పశువుల ఆస్పత్రి వద్ద గతంలో ఏర్పాటు చేసిన చిన్న రోడ్డుపైనే పట్టణంలోని వాహనాలన్ని వెళ్తుండడంతో ప్రతి రోజు కనీసం 20 సార్లు ట్రాఫిక్ జాం అవుతుంది.

రూ.7కోట్లతో పనులు

మున్సిపాలిటీలోని పాత బస్టాండ్- కొత్త బస్టాండ్ మధ్యన పెద్దవాగుపై రూ.7 కోట్లతో బ్రిడ్జి నిర్మించేందుకు 2022 డిసెంబర్‌లో టెండర్ నిర్వహించారు. సంవత్సరంలో పనులు పూర్తి చేయాలని ఒప్పందం చేసుకున్నారు. 2023 జులైలో పనులను ప్రారంభించారు. 2024 ఫిబ్రవరి నాటికి బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయ్యాయి. అప్రోచ్ రోడ్డు పనులు ఇంకా మిగిలిఉన్నాయి.

అడ్డొచ్చిన విద్యుత్ స్తంభాలు

వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జికి ఇరువైపుల 100 మీటర్ల వరకు అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. అయితే విద్యుత్ స్తంభాలు అడ్డువస్తున్నాయి. వాటిని తొలగించి పక్కకు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు టెండర్ నిర్వహించాలి. అనంతరం కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకొని స్తంభాలను తొలగించి రోడ్డు పక్కన ఏర్పాటు చేయాలి. విద్యుత్ శాఖ అధికారులు రూ.7 లక్షల అంచనాతో ప్రణాళిక రూపొందించారు. టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు కూడా పూర్తయ్యాయి. అయినా సరే అప్రోచ్ రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తికాలేదు.

ఇబ్బందులు పడుతున్న మూడు రాష్ట్రాల ప్రజలు

తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరిహద్దుగా అయిజ పట్టణం ఉంది. గద్వాల ఆర్టీసీ డిపో నుంచి వచ్చే బస్సులు అయిజ మీదుగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్తుంటాయి. అదేవిధంగా కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలనుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అయిజ మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని గద్వాలకు వెళ్తుంటాయి. డైవర్షన రోడ్డు పట్టణానికి దూరంగా ఉండడం, వాహనాలు వెళ్తుంటే దుమ్ము రేగడంతో ఆ రోడ్డుపై ప్రజలు ప్రయాణం చేయడంలేదు.

ఆలస్యం చేస్తున్నారు



వంతెన పనులు ఆలస్యంగా ప్రారంభించడమేగాక నత్తనడకన సాగుతున్నాయి. ప్రధాన రోడ్డుపై పాత వంతెనను కూల్చి వేయకముందే ప్రజల సౌకర్యార్థం డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. మొక్కుబడిగా ఊరికి దూరంగా డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేయడంతో ప్రజలు దానిపై ప్రయాణం చేయడానికి ఇష్టపడడం లేదు. వర్షాకాలం వస్తే డైవర్షన్ రోడ్డుపై మోటార్ సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది.

– నజీర్, అయిజ

ట్రాఫిక్ జాంతో ఇక్కట్లు



కొత్త బ్రిడ్జి పనులు చేపట్టడంతో ప్రజలు పశువుల ఆస్పత్రి ముందు నుంచి రోడ్డుపై వెళ్తుండడంతో రోజుకు అనేక సార్లు ట్రాఫిక్ జాం అవుతుంది. దీంతో మూడు రాష్ట్రాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రం అందజేసినా పని పూర్తికావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేయాలి.

– ఉసేని, భూంపురం

అధికారులు స్పందించాలి



బ్రిడ్జి పనులు పూర్తయ్యి నెలలు గడుస్తున్నా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వంతనపై రాకపోకలు సాగడంలేదు. అఖిలపక్షం కమిటీ నాయకులు అనేక రకాలుగా అధికారులపై ఒత్తిడి తెస్తే ఇప్పటికి ప్రజలు మాత్రమే నడిచేందుకు మట్టి వేశారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాసులు అయిజ

ప్రక్రియను పూర్తిచేస్తాం

బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అప్రోచ్ రోడ్డు వేయాల్సి ఉంది. అప్రోచ్ స్లాబ్, మెటల్ రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు పెయింటింగ్, టైల్స్ పరిచే ఆ పనులు మిగిలి ఉన్నాయి. అప్రోచ్ రోడ్డు పనులు ఇటీవలే మొదలు పెట్టారు. 2 నెలల కాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– మహేష్, ఆర్అండ్‌బీ ఏఈ

ముమ్మరంగా సాగు పనులు



ధరూరు శివారులో విత్తు కోసం పంటను సిద్ధం చేస్తున్న రైతు

విత్తుకుంటున్నాం..



ఈ సారి వర్షాలు నెల రోజులు ముందే వచ్చాయి. నాకున్న భూమిలో సాగు చేసుకునేందుకు పొలాన్ని సిద్ధం చేసి ఉంచా. ఇటీవల కురిసిన వానలు పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. విత్తనాలు వేయడానికి అనువుగా ఉండడంతో అచ్చు కొట్టి విత్తనాలు విత్తుకుంటున్నాను.

– హనుమంతు, రైతు, ధరూరు

ధరూరు: ఖరీఫ్ ముందస్తు సాగు పనులు ముమ్మరమయ్యాయి. వేసవి దుక్కులు దున్నుకుని సాగు కోసం సిద్ధంగా ఉన్న రైతుల ఆశలు నెరవేరాయి. ఇటీవల కురిసిన భారీ వర్షంతో పంట సాగుకు అనుకూలంగా మారింది. పంట పొలాల్లో ఎక్కడ చూసినా రైతులే దర్శనమిస్తున్నారు. మెట్ట పంట సాగు పనులు ముమ్మరంగా సాగుతుండగా, బోరు బావులు, కాల్వల కింద సాగు చేసే రైతులు నారు మడులను సిద్ధం చేసుకుంటున్నారు. మెట్ట పంటగా ఆముదం సాగు చేసే రైతులు అచ్చు కొట్టే పనులు చేసుకున్నారు. నెల రోజులు ఆలస్యంగా వర్షాలు కురియడంతో అన్నదాతలు ఒకింత ఆందోళన చెందుతున్నారు. ముందస్తు సాగు చేస్తే మంచి దిగుబడి ఉంటుందని రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


స్నేహితుడికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన 1995–96లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ తోటి స్నేహితుడికి ఆదివారం ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన సి.శేఖర్ మదనాపురంలో నివాసం ఉంటూ.. కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల పని చేస్తున్న సమయంలో మిషన్‌లో చేయి పడి తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మిత్రులందరూ తమ స్నేహితుడిని ఆర్థికంగా ఆదుకోవాలని ముందుకు వచ్చారు. రూ20 వేలను అందించారు. కార్యక్రమంలో భానుప్రకాశ్, ఎస్.సురేశ్, ఎస్.నర్సింహ, పి.వెంకటేశ్, సి.చంద్రశేఖర్, మాసన్న, బి.రాములు, తదితరులు ఉన్నారు.

కొత్త జీపీలకు భవనాలు కరువు



సుల్తాన్‌పురంలో అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం

- అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు
- చెట్ల కింద సమావేశాలు
- రికార్డుల భద్రతకు ఇబ్బందులు



పూజారితండాలో అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం

కేటీదొడ్డి: ప్రభుత్వం అనుబంధ గ్రామాలు, 500 పైగా జనాభా ఉన్న గిరిజన తండాలు, పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో నియామకాలు చేపట్టింది. కొత్త పంచాయతీలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేసే విషయాన్ని మాత్రం ప్రభుత్వం మరిచిపోయింది. దీంతో కొత్త పంచాయతీల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె గదులు, మూతపడ్డ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో పాలన సాగుతోంది. దీంతో పాలకవర్గ సభ్యులతో ప్రతి నెల సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నా, రెండు నెలల ఒకసారి గ్రామ సభలు నిర్వహించుకోవాలన్నా చెట్ల కిందో, టెంట్లు వేసుకునో నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

8 కొత్త పంచాయతీలు

కేటీదొడ్డి మండలంలోకి ధరూర్, కేటీదొడ్డి గ్రామాలు చేర్చగా మండలంలో 15 పంచాయతీలు మాత్రమే ఉండేవి. ప్రభుత్వం 8 కొత్త పంచాయతీలు చేర్చగా 23 ఏర్పడ్డాయి. కొత్త పంచాయతీల్లో రంగాపురం, మైలగడ్డ, ఉమిత్యాలతండా, సుల్తాన్పురం, సోంపురం, యర్సన్‌దొడ్డి, తూర్పుతండా, పూజారితండా ఏర్పాటు చేశారు. వీటిలో ఒక్క పంచాయతీకి సైతం పూర్తి సౌకర్యాలున్న భవనం లేదు. మూతపడి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాల్‌లో అరకొర వసతుల మధ్య పంచాయతీ పాలన సాగిస్తున్నారు.

రికార్డుల భద్రతకు ఇబ్బందులు

పంచాయతీల్లో రికార్డుల భద్రత గాలిలో దీపంలా మారుతోంది. వసతులు లేక రికార్డులు భద్రపరచడానికి కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. బీరువాలు, కుర్చీలు, టేబుల్స్ లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త పంచాయతీలకు సరిపడా సామగ్రి సరఫరా చేసి, వెంటనే శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమావేశాలకు తిప్పలు



పంచాయతీకి శాశ్వత భవనం సౌకర్యాలు లేకపోవడంతో సమావేశాలకు ఇబ్బందులు. పాలకవర్గం కూర్చోడానికి సైతం స్థలం లేదు. ఎవరైనా పంచాయతీ కార్యాలయానికి వస్తే బాధలు వర్ణనాతీతం

– జమున, మాజీ సర్పంచ్, పూజారితండా

భవనాలు నిర్మించాలి



కొత్త పంచాయతీలకు పక్కా భవనాలు లేక అనేక కష్టాలు ఎదురవుతున్నాయి. అటు పాలకవర్గం కూర్చోడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి, రికార్డులు భద్రపరుచుకోవడానికి స్థలం లేదు. వెంటనే శాశ్వత భవనాలు నిర్మించి సమస్యలు తీర్చాలి.

– తిక్కన్న, మాజీ సర్పంచ్, సోంపురం

నివేదికలు అందించాం

మండలంలో కొత్తగా 8 పంచాయతీలు ఏర్పడ్డాయి. పక్కా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. భవనాలపై ప్రభుత్వానికి నివేదికలు అందించాం. అయితే ఉమిత్యాలతండాకు మాత్రం పంచాయతీ భవనం మంజూరైంది. మిగతా గ్రామాలకు కూడా మంజూరైతే త్వరలోనే పనులు మొదలుపెడతాం.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



అయిజలో నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నాయకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు నరసింహయ్యశెట్టి మాట్లాడుతూ.. శ్యాం ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో భారతీయ జనసంఘ్ పార్టీని స్థాపించారని తెలిపారు. నెహ్రూ సోషలిజానికి భిన్నంగా జనసంఘ్ పార్టీ స్వేచ్ఛా మార్కెట్ విధానానికి మద్దతు పలికిందని, దేశం మొత్తానికి హిందువులు, ముస్లింలకు ఒకే విధమైన పౌర స్మృతి ఉండాలని ఉద్ఘాటించారని తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, భీమసేనరావు, ప్రదీప్‌కుమార్, భగత్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణ, రఘు పాల్గొన్నారు.

శాంతినగర్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా బీజేపీ వడ్డేపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఆదివారం గులాబీ మొక్క నాటారు.

తారాపురంలో సందెపురాళ్ల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న యువకులు

గట్టు: మండలంలోని తారాపురంలో ఏరువాక సందర్భంగా ఆదివారం సందెపురాళ్లు ఎత్తు పోటీలను నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు గ్రామాల నుంచి జనం తరలివచ్చారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని ఎనుముల రవి 82 కేజీల బరువును ఎత్తి దక్కించుకున్నారు. ద్వితీయ బహుమతి వీరేష్ 77 కేజీల బరువును ఎత్తి దక్కించుకున్నారు. తృతీయ బహుమతి 72 కేజీల బరువును ఎత్తి దక్కించుకున్నారు. బలిగెర గ్రామంలో యువకులకు పరుగు పందెం పోటీలను నిర్వహించారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



కొంకలలో పాలాభిషేకం చేస్తున్న రైతులు

శాంతినగర్: రైతులకు ఏక కాలంలో రూ..2లక్షలు రుణమాఫీ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చిత్రపటాలకు ఆదివారం రైతులు పాలాభిషేకం చేశారు. రైతు రుణమాఫీ చారిత్రాత్మక ఘట్టమన్నారు.

రైతు పక్షపాతి రేవంత్‌రెడ్డి

అయిజ: దేశం బాగుపడాలంటే ముందుగా రైతులను బాగుచేయాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని రైతు సంఘం మండల అధ్యక్షుడు మేకల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు.

ఇచ్చినమాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కే సొంతం

ఉండవెల్లి: సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ ప్రకటించి ఆమోదం తెలపడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, నాగేష్, రమేష్, మద్దిలేటి, నయీమ్, రవి, మక్తర్ భాషా, బుచ్చిరెడ్డి, సూరిబాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న జంగయ్య

జడ్చర్ల టౌన్: ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు కాలె జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. రూ.6వేలకు పింఛన్ పెంచటం వల్ల సమాజంలో గౌరవంగా బతకటానికి వీలవుతుందన్నారు. ఒకరిపై ఆధారపడకుండా తమంతకు తామే బతికేందుకు అవకాశం కల్పించినట్లవుతారన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం తమ సమితి కృషిచేస్తుందని, ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. దివ్యాంగులను ఆదుకునేందుకు ప్రభుత్వ ముందుకు రావాలని, డబుల్‌బెడ్‌రూంల కేటాయింపులో తగిన వాటా ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఇంటిస్థలంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలను ఇచ్చే విషయంలోనూ దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ విషయంలో అవసరమైతే మంత్రులతోపాటు సీఎంను కలసి సమస్యలను విన్నవిస్తామన్నారు. సమావేశంలో అందె రాంబాబు, తెలంగాణ వికలాంగుల వేదిక మహిళా అధ్యక్షురాలు లలిత, జిల్లా నాయకులు చెన్నకేశవరెడ్డి, బిచ్యనాయక్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, పద్మ పాల్గొన్నారు.

మండల స్థాయి గిరకలాగుడు పోటీలు



నగదు బహుమతి అందజేస్తున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్

అమరచింత: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పాంరెడ్డిపల్లెలో మండల స్థాయి గిరక లాగుడు పోటీలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమ వృషభాలతో గిరకలాగుడు పోటీల్లో పాల్గొన్నారు. మండల స్థాయి మొదటి బహుమతిని సింగంపేట కైవసం చెసుకోవడంతో నగదు బహుమతిగా రూ.10 వేలను అందించారు. రెండో బహుమతిని ధర్మపురం సాధించి రూ.5 వేల నగదు బహుమతి, మూడు, నాలుగు బహుమతులను పాంరెడ్డిపల్లె గ్రామ వృషాభాలు సాధించడంతో సంబంధిత రైతులకు నగదు ప్రోత్సాహకాలను అందించామని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీసీ రెడ్డి తెలిపారు. బహుమతి ప్రదాతగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ అందించగా డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ నాయకులు విష్ణు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు రూ. 11 కోట్లు

దేవరకద్ర: నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల మంజూరైందని.. ఈ విద్యా సంవత్సరం నుంచే జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు, అడ్మిషన్లు తీసుకుంటారని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. కళాశాలకు రూ. 11 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అదేవిధంగా అనువైన స్థలం చూసి నిర్మాణం చేపడతామన్నారు. అప్పటి వరకు జూనియర్ కళాశాలలో.. డిగ్రీ కళాశాలను కొనసాగిస్తామన్నారు. ఆదివారం తనక్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కళాశాల మంజూరుతో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలతో పాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. దశాబ్దాల కళ నేరవేరిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ డిగ్రీ కళాశాల గురించి పట్టించుకోలేదని విమర్శించారు.